వారి జీవితంలో స్త్రీ ప్రేమ శూన్యమయిందన్న మాట! స్త్రీ అలాంటివారి ఆసక్తి మాత్రమే తృప్తి పరిచి ఉంటుంది; కాని హృదయానికి పరితృప్తిని కలిగించి ఉండదు. స్త్రీ సహజంగా అన్ని పరిస్థితులలోనూ తన ప్రభావాన్ని పురుషులమీదికి ప్రసరింపచేస్తుంది. అందుకనే స్త్రీని శక్తి అన్నారు. ఐశ్వర్యానికీ - అభావానికీకూడా స్త్రీ పేరేపణే మూలహేతువై ఉంటుంది. స్త్రీల ప్రోత్సాహంతో యుద్ధానికి వెళ్ళినవాళ్లు విజయాన్నైనా చూరగొంటూరు. లేదా వీరస్వర్గాన్నైనా అలంకరిస్తారు. ఏ జాతిలోని స్త్రీ శక్తి జాగృతంకాదో- ఆ జాతికిచెందిన పురుషుల ఆశలూ-ఆకాంక్షలూ అందుబాటులోకి రాకుండానే పోతాయి. స్త్రీల కార్యకలాపాలు ఆ జాతియొక్క శక్తి-స్వాస్థ్యానికీ పరిచయ సూచకాలు.

(ఇంకావుంది)

---

కథానిక

# వెంకటేశం

ఫీల్కానా అప్పారావు

వెంకటేశం నడుస్తున్నాడు. వడివడిగా నడుస్తున్నాడు. దించినతల ఎత్తకుండా నడుస్తున్నాడు. అప్పుడే మధ్యాహ్నం పంద్రెండు గంటలయింది. రోడ్డుమీద జనంకూడా బాగా పల్చబడిపోయింది. సూర్యభగవానుడు నడినెత్తిమీదనుండి తన ప్రతాపమంతా వెంకటేశంలాంటి అభాగ్యులమీద చూపెడుతున్నాడు. పేదవాళ్ళంటే అతనికికూడా దయలేదుకాబోలు! ఎండ తీక్షణానికి రోడ్డుమీద తారు ఉడికి పైకుబుకుతున్నది. ఆ తారు పాదరక్షలు లేని వెంకటేశం కాళ్ళకుఅంటుకుని, కాళ్ళకుమంటలు పుట్టిస్తూంది. బాధ భరించలేని వెంకటేశం కాళ్ళ మణమలుమీద నడుస్తే కొంతయినా బాధ తగ్గుతుందని, మణమలుమీద నడుస్తున్నాడు. కొంతసేపటికి మణమలమీద కూడా నడవలేకపోయేడు. ఆపీ మంటపుట్టడం మొదలెట్టేయి. మళ్ళీ పాదాలమీద నడకసాగిస్తున్నాడు. అవి వేడెక్కగానే మణమలుమీద నడుస్తున్నాడు. యిలా కొంతసేపు పాదాలమీదా మణమలుమీద నడుస్తూ, కాలుకాలిన పిల్లిలా ముందుకు పోతున్నాడు వెంకటేశం. కాని ఎండ తీవ్రతమాత్రం హెచ్చుగా ఉంది. పోనీ ఎచటయినా ఒకక్షణం నుంచొని విశ్రాంతి తీసుకుందామంటే అప్పటికే చాలా ఆలస్యమయింది. తను ఆఫీసుకి తొందరగా వెళ్ళాలి. ఇప్పటికే ఆఫీసరు చిందులుత్రొక్కుతూ ఉంటాడు.

వెంకటేశానికి యిలామండిపోతున్న ఎండలో నడవడం అలవాటే. ఎన్నోసార్లు అతనిలా బాధపడ్డాడు, అలా బాధపడినప్పుడల్లా ఒకరూపాయి యిచ్చి కనీసం "టైరు"తో చేసిన చెప్పులన్నా కొనుక్కుందామని అనుకొనేవాడు. యిప్పుడూ అలానే అనుకున్నాడు—కాని ఏంలాభం అనుకోవడమే కాని ఎప్పటికప్పుడే ఆ కోర్కె నెరవేరడంలేదు. జీతం రావడమే తరువాయి, హారతి కర్పూరంలా హరించుకుపోతుంది. అందుచే తనకు యీ జన్మలో "చెప్పులు"తొడుక్కునే అదృష్టం లేదనుకున్నాడు వెంకటేశం. తన గమ్యస్థానం చేరుకోడానికి వడివడిగా నడుస్తున్నాడు. ఎంత వడిగా నడిస్తేమాత్రం, ఆఫీసుకి—యింటికి మధ్యనున్న దూరం తగ్గుతుందా? కాళ్లకి తోడుమీద నుండి నెత్తికూడా కాలిపోతున్నది. శిరస్సును కాపాడుకొనేందుకు గొడుగుకూడా లేదు. ఒక్క రూపాయయిచ్చి చెప్పులే కొనుక్కోలేని వెంకటేశం గొడుగు కొనగలడా? అందుచే గొడుగు లేదని వెంకటేశానికి ఏమాత్రం విచారంలేదు. ముఖంమీంచి చెమటలు ధారలుగా కారుతున్నాయి. బట్టలన్నీ చెమటతో పూర్తిగాతడిసిపోయాయి. దానికితోడు దిట్టమైన ఖద్దరుకోటొకటి. ఆఫీసురూల్సు ప్రకారం కోటులేనిదే ఆఫీసుకి పోరాదు. పొరపాటున కోటులేకుండా ఒకవేళ ఆఫీసుకివెళ్లినా ఆఫీసరు తిట్లవర్షంకురిపిస్తాడు. ఒకసారి వెంకటేశానికి ఆపరాభవంకూడాజరిగింది.

అప్పుడే కొత్త ఆఫీసరు వచ్చేడు. అప్పటి వరకు వెంకటేశానికి "కోటు"కూడాలేదు. కొనుక్కుందామన్నా డబ్బులేదు. వెంకటేశం బీదరికాన్ని గుర్తించని పాత ఆఫీసరు కోటులేకుండా ఆఫీసుకెళ్ళినా వెంకటేశాన్ని ఏమీ అనేవాడు కాదు. కాని కొత్తగావచ్చిన ఆఫీసరు చాలా నిక్కచ్చిఅయిన మనిషి. "నీకు యింత సర్వీసు ఉంది. ఆమాత్రం ఆఫీసు రూల్సు తెలియవు? ఆఫీసురూల్సుకచ్చితంగాఅనుసరించితీరాల్సిందే." వెంకటేశం కోటు కుట్టించాల్సి వచ్చింది. కోటు కుట్టించాలంటే యీ రోజుల్లో కనీసం ఇరవై రూపాయిలయినా ఉండాలి. అంతడబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? వెంకటేశానికి ఏమిచెయ్యడానికీ తోచలేదు. కోటు కుట్టించుకుందికి డబ్బులేదు. కోటు తొడుక్కుని వెళ్ళకపోతే ఆఫీసరు చివాట్లు పెడతాడు. తన ఉద్యోగానికికూడా ముప్పు తెస్తాడు. అప్పుడు యీ కాస్త ఆస్కారం కూడా పోతుంది. వెంకటేశం అదృష్టవశాత్తు కాలేజీలో చదువుకుంటున్న తన మేనల్లుడు అప్పుడే వచ్చేడు. వెంకటేశం సంగతంతా అతనితో చెప్పి ఎలాంటిదయినా ఒక కోటు యిమ్మంటే ఒకదుక్క ఖద్దరుకోటు ఇచ్చేడు. ఈ ఖద్దరు కోటే మంచిది. ఎక్కువకాలం మన్నుతుంది. మాపు కూడా బాగా వోరుస్తుంది./కోటు అనేది ఉంటేచాలు అనుకుంటున్న వెంకటేశం అదే పదివేలుఅని తీసుకున్నాడు. అప్పటినుంచి ఎప్పుడు ఆఫీసుకి వెళ్ళినా వెంకటేశం ఆ కోటే వేసుకుంటాడు. ఒకవేళ మాసిపోయినా ఏదో సెలవురోజు చూచుకొని, ఒకఅణా సబ్బుబిళ్ళకొని, తనే స్వయంగా ఉతుక్కుంటాడు. ఎప్పుడూ ఆ కోటే ఉపయోగించడంవల్ల అది అనేకచోట్ల చినిగిపోయి వాటిస్థానే మాసికలు ఏర్పడ్డాయి.

ఎండలో అలా నడుస్తున్న వెంకటేశానికి తొడుక్కున ఖద్దరుకోటు మరీ బాధిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాది. ఊపిరి తీసికోడం కూడా చాలా కష్టమనిపిస్తున్నాది. ఆ బాధ భరించలేని వెంకటేశం కోటు విప్పేద్దా మనుకున్నాడు. కాని ఘటుక్కుని మెరుపుతీగలా జ్ఞప్తికివచ్చింది. తను తొడుక్కునా చొక్కా వెనుకభాగమంతా చింకేసనీ, కోటు విప్పేస్తే అది అంతా కనిపిస్తుందని. ఇప్పుడు వెంకటేశం వేసుకున్న చొక్కా చినిగిపోతే రెండుమూడు సార్లు మాసికలువేసి టైలర్ ఓపికతో కుట్టేడు. కాని మళ్ళీ వెంటనే చినిగిపోయింది. టైలర్‌కి విసిగత్తి ఇక కుట్టలేనని నిక్కచ్చిగా చెప్పేసేడు. పోనీ ఈ చింకి చొక్కా వదిలి, ఇంకొక చొక్కా వేసుకుందామంటేవున్న రెండు చొక్కాలు ఎన్నాళ్లనుంచో చాకలిదానికి వెయ్యలేదని వెంకటేశంతో చెప్పకుండానే అతని భార్య చాకలిదానికి వేసింది. గత్యంతరంలేని వెంకటేశం యీ చింకి చొక్కా వేసుకోనక తప్పింది కాదు.

తనకున్న బలాన్నంతా వినియోగించి ఒక్కసారి గట్టిగా గాలి లోనికి పీల్చుకున్నాడు. కొంచెం ఊపిరి ఆడినట్టు అయింది. ధారలుగా కారుతున్న చెమటను తుడుచుకుందామని జేబురుమాలు (చినిగిపోయిన పంచలో ఒక చిన్న ముక్కలెండి) కోసం చెయ్యిపెట్టేడు. కాని అది ఎక్కడికో మాయమయింది. చేసేదిలేక చొక్కా కొసతోనే ఒకేసారి ముఖమంతా తుడుచుకున్నాడు.

వడిగా నడుస్తున్న వెంకటేశాన్ని చూసుకుంటూ ఒక సైకిలురిక్షా మరీవేగంతో వెళ్ళి

Firestone



నేడు-ఉత్తమమైనది
రేపు-ఉత్తమోత్తమమైనది

పోయింది. వెంకటేశం త్రుళ్ళిపడ్డాడు. దాంట్లో చలువకళ్ళజోడు పెట్టుకున్న ఒక యువకుడు కాలుమీద కాలువేసి కూర్చుని సిగరెట్ తాగుతు న్నాడు. వెంకటేశం మనస్సంతా ఆలోచనలతో నిండిపోయింది.

ఆ సైకిలురిక్షాలో ఉన్న యువకుడు ఎంత అదృష్టవంతుడు! దేనికైనా పెట్టిపుట్టాలి! తనకీ డబ్బు ఉండి తనూ రిక్షాలో... అదేం కర్మ... హాయిగా కారులో తిరుగుతూ ఉండేవాడు-కాని ఏం అనుకుంటే ఏంలాభం? తనకోరికలకు విలువ లేదు. పేదవాళ్లకోరికలు ఎప్పుడూ అంతే. అవి గాలి లోని మేడలు. ఇప్పుడు తను సైకిలురిక్షా కాదు—కనీసం చేతిరిక్షాకూడా ఎక్కే పరిస్థితుల్లో లేదు. తనకన్న ఆ చేతిరిక్షా లాగే "రామన్నే" నయం. వాడు ఎవరినో అడిగి ఒక చింకి చెప్పులు, టోపీ సంపాదించేడు. మరీ అంతగా ఎండగావుంటే ఏ చెట్టునీడనో రిక్షా పెట్టుకొని హాయిగా కునికిపాట్లు పడతాడు. తను జీవితంకంటే రిక్షావాడి జీవిత మెంతో నయం. ప్రొద్దస్తమానం కష్టపడతాడు. ఆ వచ్చినదాంతో హాయిగా తిని, నిర్భయంగా గుండెమీద చెయ్యివేసుకొని నిద్రపోతాడు. వాడిమీద ఎవరూ ఆఫీసరూ లేడు—వాడు స్వేచ్ఛా జీవి-కాని తనో, స్వేచ్ఛలేని పంజరంలో బిగించిన రామచిలుక. ఆఫీసరు చేతిలో కీలుబొమ్మ... అతడు ఎలా చెపితే అలా చెయ్యాల్సిందే. ఏమి చెప్తే అది చేసితీరాల్సిందే. పోయిపిలిస్తే అపుడు వెళ్ళవలసిందే. తనకి పగలు, రాత్రి, ఎండ, వానా అనే భేదంలేదు, తనలాంటి గుమాస్తాల జీవితమే అంత. ఆఫీసర్లు ఏమన్నా సహించాల్సిందే. పౌరుషం, ఆత్మాభిమానం, అసలే పనికిరాదు. ఓర్చుకోలేక పౌరుషపడితే ఆఫీసర్ల ఆగ్రహానికి జీవితం బలిఅయిపోతుంది.

ఇలా ఆలోచిస్తున్న వెంకటేశం నాల్గు రోడ్ల జంక్షనుదగ్గరకు వచ్చేడు. అక్కడికి వచ్చే సరికి దించిన తల మరీ క్రిందికి దించేసేడు. అలా చేయడం అతనికెప్పుడూ మామూలే, లేకపోతే యిటూ అటూ, దుకాణాల్లో ఉన్న, చిత్ర విచిత్ర వస్తువులు, తినుబడి సామానులు, కూల్ డ్రింక్సు, అవీ-యివీ అన్నీ కనబడతాయి. కళ్లు వాటిని చూచి మనస్సును చలింపచేస్తాయి. యీ రోజు ఒకటవ తేదీ అయితే కొంచం తలెత్తి వాటి నన్నిటిని ఒకసారి చూచేవాడే. కాని యిప్పుడు నడుస్తున్నది "పాపార్ వీక్" (pauper week) చేతిలో దమ్మిడీకూడా లేదు. చకచకా నడిచి వాటినన్నిటిని దాటిపోవాలనుకున్నాడు. కాని ఎక్కడో-ఎక్కడో కంయ్ మని శబ్దం విని వినిపించింది. యంత్రంలా తల శరీరం ఒక్కసారి శబ్దంవచ్చినదిక్కును వెతుక్కుంటూ తిరిగేయి. యింతాచేస్తే ఆ శబ్దం కూల్‌డ్రింక్సు షాపువద్ద సోడాబుడ్డీకొట్టిన శబ్దం మాత్రమే. "ఆవారా" బుష్‌కోటు వేసుకొని, చలవకళ్ళద్దాలు పెట్టుకున్న ఒక కాలేజీ కుర్రాడు ఒకచేతితో షర్బతుగ్లాసు పట్టుకొని "స్ట్రా"తో గ్లాసులోని షర్బత్తును మెల్లమెల్లగా పీలుస్తూ మధ్యమధ్య ఆగి ఎవరూ లేకపోయినా-యిటూ, అటూ తిరిగి పోజులిస్తున్నాడు. వెంకటేశానికి సోడాతాగుదా మని వెంటనే బుద్ధిపుట్టింది. డబ్బులకోసం కోటు జేబులన్నిటిని, చేయితడిమింది. కాని, కానీ అయినా ఉంటేగా దొరకడానికి?

వెంకటేశానికి తనగడిచిపోయిన జీవితమంతా కళ్లెదుట ఒక్కసారి మెరుపుతీగలా మెరిసి పోయింది. తల్లిదండ్రులకు జ్యేష్టపుత్రుడు తనే. కాని అందరూ జ్యేష్ఠపుత్రులు పెరిగిన గారా బంగా తను పెరగలేదు. తనతండ్రి ఎలిమెంటరీ స్కూల్లో ఒక ఉపాధ్యాయుడు. జీతం చాలా తక్కువ. వెంకటేశం అతికష్టంమీద ఆరవ క్లాసుకి వచ్చేడు. అప్పటికే కుటుంబం చాలా పెరిగిపోయింది. తనకి ముగ్గురు తమ్ముళ్ళు, యిద్దరు చెల్లెళ్లు తయారయేరు. తండ్రి తనకొచ్చే స్వల్ప జీతంతో యింతకుటుంబాన్ని పోషించలేక పోయేడు. ఒకపూటగడవటం కష్టమయినా యిక తన చదువెలా సాగుతుంది. కాని దేవుడిలా తన సహాయానికి తన పినతండ్రి వచ్చేడు. తను చిన్న ప్పటినుంచి చదువులో తెలివయినవాడవడంవల్ల ఎలాగయినా "స్కూలుఫైనలు" వరకు చదివిస్తా నన్నాడు. తను కష్టపడి చదివేడు. మొదటి సంవత్సరమే మంచిమార్కులతో ఉత్తీర్ణుడయేడు. యిలా ప్యాసు కావడం తన పినతండ్రిని ఎంతో సంతోషపరచింది. "బి. ఎ వరకు చదివించాలి" అని కాలేజీలో చేర్పించేడు. కాలేజీలో చేరిన తను-తన భావిజీవితంమీద ఆశాపూరితమైన కల లెన్నో గన్నాడు. తన బి. ఎ. మొదటి శ్రేణిలో

ప్యాసవుతాడు-తరువాత ఐ. ఏ. ఎస్ పరీక్షకి కడతాడు-యింకేముంది. తను యేజిల్లా ఆఫీసరో అయిపోతాడు-ఎంతఅదృష్టం-తను,తన కుటుంబం ఎన్నాళ్ళగానో పడుతున్న బాధలు గట్టెక్కిపోతాయి. తమ్ముళ్ళను పెద్దచదువులు చదివిస్తాను. చెల్లెళ్ళకు మంచిమంచి సంబధాలుచూచి పెళ్ళిచేస్తాను అనుకున్నాడు. కాని తనకోర్కెలు నెరవేరకముందే తన జీవితమంతా అంధకార బంధురంలో ముంచి తనతండ్రి "యిక మన కుటుంబభారంనువ్వే వహించాలి"అంటూ కళ్ళు మూసేడు. అప్పటికి తను ఇంటర్‌మీడియట్ మొదటిసంవత్సరం ప్యాసయేడు. బి. ఎ. వరకు తను చదివిస్తానన్న పినతండ్రి కూడా ఇక లాభం లేదన్నాడు. "యిప్పుడు మీ కుటుంబభారం నువ్వేవహించాలి. ఏదో స్కూలు ఫైనలు ప్యాసయేవు. ఎక్కడికెళ్ళినా 70 రూపాయలకు తక్కువజీతం యివ్వరు. ఇప్పుడు నాపరిస్థితులు కూడా బాగులేవు. నీకూ పెద్దచదువులు చదివి పెద్ద ఉద్యోగాలుచేసే యోగంలేదు. ఎక్కడైనా ఉద్యోగం ప్రయత్నించు" అన్నాడు. ఆ నాటి నుంచి కుటుంబభారమంతా తననెత్తిమీదపడింది. తమ్ముళ్లుకూడా యింకా చిన్నచదువులు చదువుతున్నారు. గత్యంతరంలేని తను కుటుంబభారం వహించడానికి గుమాస్తాగా ఉద్యోగంలో ప్రవేశించేడు. ఆ ఉద్యోగం కూడా తనతల్లికుండే బంగారుగాజులు రెండూ అమ్మితేగాని వచ్చింది కాదు.

"చల్లగాలిలో..." అని కృష్ణా కాఫీ హౌస్ లోంచి వినబడుతున్నపాట వెంకటేశాన్ని తన ఆలోచనా ప్రపంచంలోంచి మెడ పట్టుకొని యీ ప్రపంచంలోకి నెట్టింది. కాని చల్లగాలిలో అన్న ఆ పాట వెంకటేశం చెవులకి యెంతో కఠోరంగా విన్పించింది. ఎండ మండిపోతూ కాళ్లు నెత్తి కాలిపోతూ వుంటే, చల్లగాలి లోటు! చల్లగాలిలో! అని విసుక్కున్నాడు-కాని ఆపాట తనలాంటి వాళ్ళకు కాదని కాఫీహోటలులో ఫేన్లక్రింద కూర్చుని కూల్‌డ్రింక్స్ - ఐస్‌క్రీమ్‌లు తాగుతున్నవారికి మాత్రమేనని తెలిసికోలేకపోయేడు వెంకటేశం.

ప్రక్క దుకాణంలో టంగుమని ఒక గంట విన్పించింది. అప్పుడే తను బయిలుదేరి అరగంట అయింది. ఆఫీసరు తనమీద యీపాటికి తోక తొక్కిన త్రాచులా పొగలు, గక్కుతూవుంటాడు. అని వెంకటేశం నడకవేగంమరీ హెచ్చించేడు. పావుగంటలో ఆఫీసు చేరుకున్నాడు. ఆఫీసరు ఫేన్ కింద కూర్చొని ఫైలు యిటూ అటూ తిరగేస్తున్నాడు. చెమటలు కారిపోతున్న వెంకటేశం ఒకసారి తుడుచుకుని ఆఫీసరు ఎదుటకి వెళ్ళేడు. "ఏం ఇంత ఆలస్యమయిందేమి?" అన్నాడు ఆఫీసరు ఘర్జిస్తూ. "అమ్మగారు ఇంటికి రమ్మంటే వెళ్ళేను." అన్నాడు సవినయంగా వెంకటేశం.

"అన్నట్టు మరిచిపోయేను. చూడు అమ్మగారికి ఆవకాయ పెట్టడంరాదు—నీ భార్యను పంపిస్తే కొంచెం సహాయంచేస్తుంది. ఇందుకే కదూ అమ్మగారు పిల్చేరు?" అన్నాడు ఆఫీసరు కొంచెం నెమ్మదిగానే.

తను ఆఫీసులో గొడ్డులా కష్టపడడమేకాకుండ తన భార్యకూడా ఆఫీసరు యింట్లో పనిదానిలా కష్టపడడమేమిటి? ఇలా ఎన్నో పనులు చేయించుకుంటున్నది అమ్మగారు. "ఈసారి నాభార్య సహాయానికి రాదు" అని కచ్చితంగా చెప్పేద్దామనుకున్నాడు. కాని ఆమాట నోట రాలేకపోయింది,

"చిత్తం. అందుకేపిల్చారు- రేపు పంపుతాలెండి" అనిమాత్రం అనగల్గేడు.

ఫైల్సు సర్దుకుంటున్న వెంకటేశానికి ఆఫీసరు దగ్గర నుంచి పిలుపు వచ్చింది.

"వెంకటేశం నిన్న ఫైర్ కాఫీ చెయ్యమని యిచ్చిన ఫైల్సు తెచ్చావా?" అని ఆడిగేవాడు ఆఫీసరు.

వెంకటేశం గుండె గతుక్కుమంది.

"క్షమించాలి-మరిచిపోయేను" - అన్నాడు.

కోపంతో ఆఫీసరు వెంకటేశాన్ని నానా చీవాట్లు పెట్టేడు. "అజాగ్రత్తగా ఉంటే పని పోతుంది-జాగ్రత్త. ఈవేళ టపాలో అవి పంపించాలి. ఇంటికెళ్ళి తొందరగా తీసుకురా." అని హూంకరించేడు-ఆఫీసరు.

వెంకటేశం ఏమీ అనలేకపోయేడు - మళ్లా ఎండలో మాడుతూ పయన మవుతున్నాడు తన కష్టాలు ఎప్పటికైనాఅంతమవుతాయా,తనకెప్పటికైనా ఆకాశంలో ఎగిరే పక్షిలా స్వేచ్ఛ లభిస్తుందా అని ఆలోచించుకుంటూ.